RNI NO.TELTEL/2023/87655

# దీక్ష ప్రభ

తెలుగు దినపత్రిక

12-05-2026
మంగళవారం, హైదరాబాద్

సంపుటి: 04 । సంచిక: 38
పేజీలు: 04 । వెల: 5/-
ఎడిటర్: రాథోడ్ వినోద్ కుమార్

FOLLOW:
https://epaper.deekshaprabhadaily.com



## రోడ్ల నిర్మాణంతోనే రాష్ట్ర అభివృద్ధి

2



# విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలం

### ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలి

### విద్యావ్యవస్థలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైంది



- వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించాం
- మేం అధికారంలోకి రాగానే 11వేల టీచర్ పోస్టులను భర్తీ చేశాం
- 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి నియామకపత్రాలు అందించాం
- విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని 25 మంది టీచర్లను ఫిన్‌లాండ్‌కు పంపించాం
- ఉత్తమ విద్యా విధానాలను తెలంగాణలో అమలు చేస్తాం
- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పోషకాహారం పెట్టనున్నాం
- మధ్యాహ్న భోజనంతోపాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించాం
- టెన్ ప్లస్ టూ విధానం లేకపోవడం వల్లే పది తర్వాత డ్రాప్ అవుట్లు పెరుగుతున్నాయి
- కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం
- విద్యా వారోత్సవాలను ప్రారంభించి మాట్లాడిన సీఎం రేవంత్

2

ప్రజాపాలన ప్రగతి ప్రాణాళికలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి ఎల్బీ స్టేడియం వేదికగా విద్యా వారోత్సవాలను ప్రారంభించారు. మే 17 వరకు వారోత్సవాలు జరగనున్నాయి. బడుల అభివృద్ధి, ఉపాధ్యాయుల సమా వేశాలు విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించే ప్రత్యేక కార్యక్రమాలను ప్రజాపాలన-ప్రగ తి ప్రణాళికలో భాగంగా ఈ వారోత్సవాల ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో విద్యను నిర్ల క్ష్యం చేశారని అన్నారు. విద్యను నిర్లక్ష్యం చేస్తే రాష్ట్రం వెనుకబడిపోతుందని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ఉద్య మాన్ని ఉవ్వెత్తున ఉరికించారని కొనియా డారు. విద్యార్థుల పోరాటం వల్లే స్వరాష్ట్రం సాధ్యమైందని అన్నారు.

## స్టాలిన్ ఇంటికి సీఎం విజయ్

### రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చ

**చెన్నై, దీక్షప్రభ:** తమిళనాడు కొత్త సీఎం విజయ్ మాజీ సీఎం ఎంకే స్టాలిన్ తో భేటీ అయ్యారు. టీవీకే చీఫ్ సోమవారం డీఎంకే అధినేత నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. స్టాలిన్ నివాసంలో జరిగిన ఈ భేటీలో మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయ నిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. ఈ నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్ర ఖజానాను గత డీఎంకే ప్రభుత్వం ఖాళీ చేసిందని ఇప్పటికే విజయ్ ఆరోపించారు. దీనికి స్టాలిన్ కూడా బదులిచ్చారు. అప్పులు పరిమితికి లోబడే ఉన్నాయన్నారు. కొవిడ్ లాంటి విపత్తును ఎదుర్కొని, నిధులు ఇవ్వడంలో అడ్డంకులు సృష్టించిన బీజేపీని తట్టుకుని దీటుగా నిలబడ్డామని తెలిపారు. ఈ నేపథ్యంలో వీరిద్దరు సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది.





## జీవో 38 ప్రకారం ప్రభుత్వ వైద్యుల బదిలీలు

- బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తాం
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా హాస్పిటళ్లను తీర్చిదిద్దుతున్నాం
- హాస్పిటళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీవో ప్రకారం ట్రాన్స్‌ఫర్లు ఉంటాయి
- జిల్లాల్లోని కాలేజీలు, హాస్పిటళ్లలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి బదిలీల్లో అవకాశం కల్పిస్తాం
- మంత్రి దామోదర్ రాజనర్సింహ

2

## హైదరాబాద్ టు ముంబై.. మెడిసిన్ రవాణాకోసం స్పెషల్ ట్రైన్



- నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో భారతీయ రైల్వే దూసుకపోతుంది
- మొదటి రెగ్యులర్ 'ఔషధి ఎక్స్‌ప్రెస్' ప్రత్యేక రైలును తెలంగాణకు కేటాయించడం గర్వంగా ఉంది
- మందులను వాటి నాణ్యత తగ్గకుండా సరఫరా చేయాలనేది మోడీ సర్కారు సంకల్పం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2

## బీఆర్ఎస్‌లో నయా జోష్

- నేడు అధినేత కేసీఆర్ కీలక సమావేశం
- పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వంపై నిర్ణయం
- పార్టీ ఇన్‌చార్జీలను సైతం నియమించనున్న కేసీఆర్
- పార్టీ బలోపేతంపైనే సీరియస్ డిస్కషన్



2

## 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ ఉంచుకోవాలి

- రామగుండం నుండి రాష్ట్రానికి కనీసం 90 శాతం సరఫరా చేయాలి
- రైతులకు నానో యూరియాపై కంపెనీలు కూడా అవగాహన కల్పించాలి
- ఎమ్మార్పి కంటే ఎక్కువ ధరకు ఎరువుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



2

# బీఆర్ఎస్‌లో నయా జోష్

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** రాష్ట్ర రాజకీయాల్లో బీఆర్ఎస్ మరోసారి యాక్టివ్ మోడ్‌లోకి వస్తున్నది. లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీ కార్యకలాపాలు కొంత మందగించిన నేపథ్యంలో.. ఇప్పుడు పార్టీని మళ్లీ గాడిలో పెట్టేందుకు అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. మంగళవారం ఎర్రవెల్లి ఫాంహౌజ్‌లో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. దాంతో పార్టీ కేడర్‌లో జోష్ కనిపిస్తున్నది. ఇటీవలే జగిత్యాలలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన కేసీఆర్.. కార్యకర్తల్లో తన స్పీచ్‌తో కొత్త ఉత్సాహాన్ని తెచ్చారు. ఆ తరువాత పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేళ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిని అమలు చేసే దిశగా ముందుకెళ్తున్నారు. అందులోభాగంగానే భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ జరిపేందుకు నేడు ముఖ్య సమావేశం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, జిల్లా, నియోజకవర్గ స్థాయి ఇన్‌చార్జీల నియామకం, కేడర్ యాక్టివేషన్ వంటి అంశాలపై కేసీఆర్ స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్‌లో కొంత నిరుత్సాహ వాతావరణం నెలకొంది. పలువురు నేతలు పార్టీ మారడం, కొన్ని జిల్లాల్లో కేడర్ సైలెంటుగా మారడం వంటి పరిణామాలు పార్టీని ఆలోచనలో పడేశాయి. అయితే.. ఇటీవల పార్టీ కార్యకర్తల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్, గ్రామ స్థాయిలో ఇంకా పార్టీకి బలమైన కేడర్ ఉన్నదనే అంచనాలతో కేసీఆర్ మళ్లీ సంస్థాగత నిర్మాణంపై ఫోకస్ పెట్టారు. పార్టీని కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం చేయకుండా, ప్రజా సమస్యలపై పోరాట పార్టీగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నారు. అందుకే.. నేడు నిర్వహించే సమావేశంలో ప్రధానంగా సభ్యత్వ నమోదు కార్యక్రమంపైనే చర్చ జరగనుంది. గతంలో బూత్ స్థాయి వరకు బలమైన నిర్మాణం ఉన్నప్పటికీ.. రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయిన తరువాత పార్టీ నిర్మాణంపై పెద్దగా దృష్టి సారించలేదు. దీంతో మళ్లీ గ్రామ కమిటీలు, మండల కమిటీలు, జిల్లా కమిటీలను యాక్టివ్ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భారీ స్థాయిలో చేపట్టి యువత, మహిళలు, రైతులు, ఉద్యోగులు, బీసీ వర్గాలను మరింతగా పార్టీలో చేర్చుకునేలా ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. డిజిటల్ మెంబర్‌షిప్‌తోపాటు ఆఫ్‌లైన్‌లోనూ సభ్యత్వ నమోదు చేసేలా ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కార్యకలాపాలు బలహీనంగా ఉన్న జిల్లాలపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. ప్రతి జిల్లాకు ప్రత్యేక ఇన్‌చార్జీలను నియమించి, నెలవారీ రిపోర్టులు తీసుకునే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో స్థానిక నేతల మధ్య విభేదాలు పార్టీకి నష్టంగా మారుతున్న నేపథ్యంలో, వాటిని సమన్వయం చేసే బాధ్యతను సీనియర్ నేతలకు అప్పగించే అవకాశం ఉన్నది. పార్టీకి కట్టుబడి పనిచేస్తున్న నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటే సభ్యత్వం, కమిటీల నియామకాలను సైతం ఆ ఇన్‌చార్జి నేతృత్వంలోనే చేపట్టేందుకు సిద్ధం అయినట్లు తెలిసింది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎర్రవెల్లి నివాసంలో కేసీఆర్ అధ్యక్షతన ఈ సమావేశం జరగనున్నది. ఇందులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పార్టీ ప్రధాన కార్యదర్శులు, మండలి, శాసనసభాపక్షాల ఉప నాయకులు పాల్గొంటున్నారు. మధ్యాహ్నం లంచ్ అనంతరం జరగనున్న ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వం, పార్టీ ఇన్చార్జిల నియామకం సహా పార్టీ బలోపేతం, తదితర ముఖ్య విషయాలపై చర్చించనున్నారు.

## ఎన్నికల ఫలితాలపై టీఎంసీ పిటిషన్

**ఢిల్లీ, దీక్షప్రభ:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అంశంలో టీఎంసీ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా 'సర్' వల్ల ఫలితాలు తారుమారయ్యాయని టీఎంసీ వాదనలు వినిపించింది. పలుచోట్ల స్వల్ప తేడాతో ఓడిపోయామంది. 'సర్'లో తొలగించిన ఓట్ల పునరుద్ధరణ కోసం వేలల్లో అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. అవి పరిష్కరించకుండానే ఎన్నికలు జరిగాయని పేర్కొంది. వేలల్లో పెండింగ్‌లో ఉన్న 31అసెంబ్లీ స్థానాల్లో కొన్ని వందల ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యామని వెల్లడించింది. ఒక నియోజకవర్గంలో తమ పార్టీ అభ్యర్థి కేవలం 862 ఓట్ల తేడాతో ఓడిపోయారని టీఎంసీ పేర్కొంది. ఆ నియోజకవర్గంలో ఓటర్ల జాబితా నుంచి 5,000కు పైగా పేర్లు తొలగించారని ఆరోపించింది. రాష్ట్రంలో తమ పార్టీకి భాజపాకు మధ్య మొత్తం ఓట్ల తేడా సుమారు 32 లక్షలు ఉండగా.. ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లు 35లక్షలకు పైగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి అవకతవకల వల్లే ఎన్నికల ఫలితాలు తారుమారు అయ్యాయంది. టీఎంసీ వాదనలపై సుప్రీం కోర్టు స్పందిస్తూ.. ఓట్ల తొలగింపులు చేపట్టిన ప్రాంతాల్లో స్వల్ప తేడాతో పార్టీ ఓడిపోతే దానిపై తిరిగి దరఖాస్తు చేసుకునే స్వేచ్ఛ బాధితులకు ఉంటుందని పేర్కొంది. అటువంటి స్థానాలలోని ఓటర్లు లేదా పార్టీలు కొత్త దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ నేతృత్వంలోని ధర్మాసనం వెల్లడించింది. అటువంటి కేసులను తాము పరిశీలిస్తామంది.

## భారీ గంజాయి అక్రమ రవాణా

# గుట్టు రట్టు

**గచ్చిబౌలి, దీక్షప్రభ:** రాష్ట్రాల సరిహద్దులు దాటి గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న భారీ గంజాయి అక్రమ రవాణాను సైబరాబాద్ పోలీసులు గుట్టురట్టు చేశారు. పక్కా సమాచారంతో కూకట్‌పల్లి ఎస్‌వోటీ బృందం, పటాన్‌చెరు పోలీసులతో కలిసి దాడులు చేశారు. రూ.2 కోట్ల విలువైన 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసులో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. సోమవారం శేరిలింగంపల్లి డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన మనీషా పద్వాల్ గంజాయి వ్యాపారంలో భారీ లాభాలు గడించాలనే ఉద్దేశంతో ఒడిశాకు చెందిన సరఫరాదారు ట్రిబ్యూన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. వీరిద్దరికీ ప్రతాప్ హరిదాస్ పవార్(24) మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నాడు. ఈ నెల 8న మహారాష్ట్ర నుంచి నిందితులు డీసీఎం వాహనంలో ఒడిశాలోని మల్కన్‌గిరికి గంజాయి కోసం బయలుదేరారు. కాగా సరఫరాదారు ట్రిబ్యూన్.. ప్రతాప్‌కు ఫోన్ చేసి గంజాయి రాజమండ్రి చేరుకుందని.. అక్కడి నుంచి తీసుకెళ్లాలని చెప్పడంతో నిందితులు అక్కడికి చేరుకొని అనుమానం రాకుండా డీసీఎంలో లోడ్ చేశారు. దానిపై ఖాళీ కూరగాయల ప్లాస్టిక్ ట్రేలను పేర్చారు. కారును ఎస్కార్ట్‌గా వాడుతూ నగరానికి చేరుకొని, ఔటర్ రింగ్ రోడ్ మీదుగా మహారాష్ట్రకు తరలిస్తుండగా.. సోమవారం ఉదయం ముత్తంగి వద్ద కూకట్‌పల్లి ఎస్‌వోటీ, పటాన్‌చెరు పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**

మహారాష్ట్రకు చెందిన ప్రతాప్ హరిదాస్ పవార్, డీసీఎం యజమాని ఆనంద్ మాయప్ప హోవల్(34), కారు యజమాని బాలాజీ గణేశ్ హోస్మణి(35), డీసీఎం డ్రైవర్లు రోహిత్ హోవల్ (27), చందన్‌శివే ఔదుంబర్(46), రంజిత్ రాజేందర్ గడగే(27)తో పాటు బాలుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా పరారీలో ఉన్న ప్రధాన నిందితులు మనీషా, ట్రిబ్యూన్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. గంజాయితో పాటు డీసీఎం, కారు, ఆరు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులు గంజాయి రవాణాకు సంబంధించిన లావాదేవీలను హవాలా రూపంలో నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సరకు పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో ఎస్‌వోటీ డీసీపీ పి.శోభన్‌కుమార్, అడిషనల్ డీసీపీ విశ్వప్రసాద్, ఏసీపీ శ్రీనివాస్, పటాన్‌చెరు ఇన్‌స్పెక్టర్ జి.వినాయక్‌రెడ్డి, డీఐ బి.రాజు తదితరులు పాల్గొన్నారు.



# విద్య ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలం

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** విద్యా వ్యవస్థకు సంబంధించి రూ.1100 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ఈ రంగంలోనూ తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు గురైందని తెలపారు. వివక్ష వల్లే 1969లో తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని, అప్పటి నుంచి దశాబ్దాల పాటు పోరాడి తెలంగాణ సాధించుకున్నామని గుర్తు చేశారు. వర్సిటీలు నిర్లక్ష్యానికి గురైతే మన విద్యా వ్యవస్థ ప్రమాణాలు పడిపోతాయని గ్రహించామని, ఉత్తమ విద్యా ద్వారానే మంచి సమాజాన్ని నిర్మించుకోగలుగుతామని వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి విద్యా వారోత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 11 వేల టీచర్ల పోస్టులను భర్తీ చేసిందన్న సీఎం 60 రోజుల్లోనే పరీక్షలు నిర్వహించి, నియామకపత్రాలు అందించామని తెలిపారు. 20 ఏళ్లపాటు ప్రభుత్వ టీచర్లకు పదోన్నతులు ఉండలేదని ఆరోపించారు. వివాదాలకు తావు లేకుండా 36 వేల మంది టీచర్లను బదిలీ చేశామని అన్నారు. 4 అంశాల్లో తెలంగాణను నీతిఆయోగ్ అభినందించిందని గుర్తు చేశారు. 27 వేల పాఠశాలల్లో 19 లక్షల మంది పేద విద్యార్థులు చదువుతున్నారని.



రాష్ట్రంలో విద్యార్థులు, టీచర్ నిష్పత్తి 17:1 గా ఉందని అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థలో ఉన్న లోపాలను మనం అధిగమించాలని సీఎం తెలిపారు. ఫలితాల్లో ప్రైవేటుతో పోలిస్తే ఎందుకు వెనకబడి ఉన్నామో ఆలోచించాలని కోరారు. కమిషన్ సిఫార్సుల ప్రకారం విద్యాశాఖకు నిధులు 15శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు. విదేశాల్లో విద్యా విధానంపై అధ్యయనం చేయాలని టీచర్లను పంపిస్తున్నామని, ఇప్పటికే కొంతమంది టీచర్లు ఫిన్లాండ్‌లో అధ్యయనం చేసి వచ్చారని పేర్కొన్నారు. విద్యతో పాటు పిల్లలను సాంకేతిక నైపుణ్యాలు, క్రీడల్లో తీర్చిదిద్దాలని, విద్యా రంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని వెల్లడించారు. మనం మాత్రం ఇంకా కాలం చెల్లిన సిలబస్‌నే కొనసాగిస్తున్నామని, టెన్ ప్లస్ టూ విధానం లేకపోవటం వల్ల పది తర్వాత డ్రాప్‌అవుట్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బలవర్థకమైన పోషకాహారం పెట్టాలని నిర్ణయించామని, మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్‌ఫాస్ట్ పథకం పెట్టాలని నిర్ణయించామని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని కొన్ని స్కూళ్లల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామని రేవంత్ రెడ్డి తెలిపారు. 16 ఏళ్లుగా హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోతే ఈ ప్రభుత్వం పెంచిందని, 10 ఏళ్ల తర్వాత ఈ ప్రభుత్వమే విద్యార్థులకు డైట్ ఛార్జీలు పెంచిందని గుర్తు చేశారు. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ కులానికొక రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటు చేశారని, వేర్వేరు రెసిడెన్షియల్స్ వల్ల కులవివక్ష పెరుగుతుందని తాము గ్రహించామని తెలిపారు. కులవివక్షను రూపుమాపేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని, ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా మారాలని కోరారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో ఒక్కో సమస్యను క్రమంగా పరిష్కరిస్తామని, ఒక టీచర్ సరిగా పనిచేయకపోతే విద్యార్థి జీవితంతో పాటు సమాజం చెడిపోతుందని పేర్కొన్నారు. క్యూర్ ప్రాంతంలో పాఠశాలల అభివృద్ధికి కేటాయించిన పలు కార్యక్రమాలకు సీఎం శ్రీకారం చుట్టారు. ఎల్‌బి స్టేడియంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కేకే, ఎమ్మెల్సీ కోదండరాం, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, వర్సిటీల వీసీలు హాజరయ్యారు. విద్యా వారోత్సవాల్లో పాల్గొనేందుకు పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు తరలి వచ్చారు.

# రోడ్ల నిర్మాణంతోనే రాష్ట్ర అభివృద్ధి

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** రోడ్ల నిర్మాణంతో రాష్ట్రంలోని ప్రతి పల్లె, ప్రతి మండలం, ప్రతి పట్టణం అభివృద్ధి చెందుతుందని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రహదారుల అభివృద్ధి వల్ల పరిశ్రమలు ఏర్పడితే మౌలిక వసతులు పెరుగుతాయని అన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, తద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అమలు చేయనున్న హ్యామ్ రోడ్ల విధానంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేసిన నేపథ్యంలో దేశమంతా హ్యామ్ టెండర్లు ఎలా సాగుతున్నాయో ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. హ్యామ్ ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి సోమవారం సచివాలయంలో అధికారులతో మూడు గంటల పాటు సుదీర్ఘంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో చేపడుతున్న హ్యామ్ రోడ్ల ప్రాజెక్టుల పురోగతి, పనుల నాణ్యత, నిర్మాణ వేగం, ప్రజలకు కలిగే ప్రయోజనాలపై అధికారులతో మంత్రి సమగ్రంగా చర్చించారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖ (మోర్త్) ప్రవేశపెట్టిన హ్యామ్ విధానాన్ని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్.హెచ్.ఎ.ఐ) 2016 నుంచి దేశవ్యాప్తంగా విజయవంతంగా అమలు చేస్తోందని అధికారులు మంత్రికి తెలిపారు. ఇప్పటివరకు 374కు పైగా ప్రాజెక్టులను రూ.4 నుంచి 5 లక్షల కోట్ల పెట్టుబడులతో చేపట్టినట్లు వెల్లడించారు. జాతీయ స్థాయిలో విజయవంతమైన ఈ విధానాన్ని మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు ఇప్పటికే అమలు చేస్తున్నాయని, అదే నమూనాలో తెలంగాణ ప్రభుత్వం కూడా రాష్ట్ర రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎక్సెస్ టెండర్లు అంటూ వస్తున్న ఆరోపణలపై మంత్రి అధికారులను అడిగారు. హ్యామ్ అమలు చేసిన మహారాష్ట్ర, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలతో పోల్చి చూస్తే తెలంగాణలోనే ఎక్సెస్ తక్కువగా ఉందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అవి అసత్య ప్రచారాలు అని గణాంకాలతో సహ మంత్రికి వివరించారు.

**ఫేజ్-1 కింద రూ. 13 వేల కోట్లతో 441 రోడ్లు**

ఫేజ్1 కింద ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.13,006.27కోట్ల వ్యయంతో 441 రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ఇవి మొత్తం 6,092.37 కి.మీ పొడవుతో 34 ప్యాకేజీలుగా అమలు అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.6,250 కోట్లతో 2,162 రహదారుల నిర్మాణ పనులు 7,450 కి.మీ పొడవుతో 17 ప్యాకేజీల రూపంలో కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల అమలుకు ముందు టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ స్టడీస్ నిర్వహించి, ఎన్.హెచ్.ఏ.ఐ నమూనాలోనే ఆర్.ఎఫ్.పీ, డీసీఏ డాక్యుమెంట్లు రూపొందించి పారదర్శకంగా టెండర్లు ఆహ్వానించినట్లు అధికారులు వివరించారు. సాధారణ రహదారి పనులతో పోలిస్తే హ్యామ్ ప్రాజెక్టుల్లో అదనపు ప్లాంట్ అండ్ మెషినరీ వినియోగం, ఆధునిక డిజైన్లు, సర్వేలు, 15 ఏళ్ల నిర్వహణ బాధ్యత, పెట్రోలింగ్ వాహనాలు, అంబులెన్స్ సేవలు, ఇండిపెండెంట్ ఇంజనీర్ ఛార్జీలు, జీఎస్టీ, వడ్డీ భారం వంటి అంశాల కారణంగా అదనపు వ్యయం ఉంటుందని అధికారులు తెలిపారు. జీఎస్టీ, వడ్డీ ప్రభావం వల్లే సుమారు 9.30 శాతం అదనపు భారం పడుతోందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో చేపట్టిన హ్యామ్ ప్రాజెక్టుల్లో కూడా భారీ పాజిటివ్ ఎక్సెస్ బిడ్ ట్రెండ్ నమోదైందని వెల్లడించారు. గుజరాత్‌లో 66 శాతం, మహారాష్ట్రలో 47 శాతం వరకు ఎక్సెస్ పాజిటివ్ బిడ్లు నమోదయ్యాయని తెలిపారు. ఎన్.హెచ్.ఏ.ఐ ప్రాజెక్టుల్లో కూడా 50 శాతం వరకు అధిక బిడ్లు వచ్చిన ఉదాహరణలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా మారుతున్న ఆర్థిక పరిస్థితుల ప్రభావంతో ఇంధనం, బిటుమెన్, స్టీల్, సిమెంట్ తదితర నిర్మాణ సామగ్రి ధరలు భారీగా పెరిగాయని.. బిటుమెన్ ధరలు దాదాపు 100 శాతం వరకు పెరిగినట్లు అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు వ్యయంపై 20 నుంచి 25 శాతం వరకు ప్రభావం పడుతుందన్నారు. టెండర్ ప్రక్రియ ప్రారంభమైన సమయంలో బిటుమెన్ ధర మెట్రిక్ టన్నుకు రూ.44 వేలుగా ఉండగా, ప్రస్తుతం రూ.89 వేల వరకు చేరిందని, అంటే దాదాపు 100 శాతం పెరుగుదల నమోదైందని అధికారులు వివరించారు.

## 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా

# బఫర్ స్టాక్ ఉంచుకోవాలి



**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** రాష్ట్రంలో జూన్ మొదటి వారంలో వరి నాట్లు ప్రారంభమైతాయని అధికారులు ఈనెలాఖరు నాటికి 3.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్ సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన మిగిలిన యూరియాను అత్యవసరంగా రాష్ట్రానికి తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సోమవారం సచివాలయంలో ఎరువుల కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో 1.46 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌తో పాటు సుమారు 10 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు 11.50 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా, 10 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే కేటాయించిందన్నారు. రాష్ట్రంలోనే ఉన్న రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యే యూరియాలో కనీసం 90 శాతం తెలంగాణ అవసరాలకే కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వనరులను వినియోగించి ఇక్కడే ఉత్పత్తి జరుగుతున్న యూరియా, రాష్ట్ర రైతులకు అవసరమైన సమయంలో అందకపోవడం అన్యాయమన్నారు. ఈ అంశంపై రామగుండం ఎరువుల కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. గత నెలలో కేటాయింపుల మేరకు సరఫరా చేయని కంపెనీలు, మిగిలిన పరిమాణంతో పాటు ఈ నెల కోటాను కూడా సమయానికి సరఫరా చేయాలని ఆదేశించారు. రేక్ పాయింట్లకు చేరిన యూరియాను జిల్లాలకు తరలించే ప్రక్రియలో ఎటువంటి జాప్యం జరగకూడదని, హ్యాండ్లింగ్, రవాణాలో నిర్లక్ష్యం కనబరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎరువులను హోల్ సేల్, రిటైల్‌లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్మితే కఠిన చర్యలు తప్పవన్నారు. యూరియా యాప్‌ను మార్గదర్శకంగా తీసుకొని కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఎరువులను అందించేందుకు ఒక సరికొత్త యాప్‌ను తీసుకువస్తుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలోని రెండు జిల్లాలలో ఈ యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. మన రాష్ట్రంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలో ఈ యాప్‌ను అమలు చేయనున్నారని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వాడుతున్న రైతుల అనుభవాలను వీడియో రూపంలో చిత్రీకరించి రైతు నేస్తం కార్యక్రమంలో ప్రసారం చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని, యూరియాను అధికంగా వినియోగిస్తే భూసారం దెబ్బతిని, భవిష్యత్తులో దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ సమావేశంలో ఏపీసీ సురేంద్ర మోహన్, అగ్రికల్చర్, ఫార్మర్స్ వెల్ఫేర్ డిజిటల్ వింగ్ డైరెక్టర్ సరితా లక్ష్మీ, వ్యవసాయశాఖ డైరెక్టర్ డా. గోపి, ఎరువుల కంపెనీల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జీవో 38 ప్రకారం ప్రభుత్వ వైద్యుల బదిలీలు

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** ప్రభుత్వం ఇచ్చిన జీవో 38 ప్రకారం పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేపడుతామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. ఈ మేరకు గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) ప్రతినిధులతో మంత్రి సోమవారం సమావేశం నిర్వహించారు. సెక్రటేరియట్‌లోని మంత్రి చాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జడ్ చొంగ్తు, జాయింట్ సెక్రటరీ అయేషా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ గౌరవ్ ఉప్పల్, డీఎంఈ నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నరహరి, జనరల్ సెక్రటరీ లాలూ ప్రసాద్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. గతంలో జనరల్ ట్రాన్స్‌ఫర్లు పారదర్శకంగా జరిగాయని, ఈసారి కూడా అదే విధంగా ట్రాన్స్‌ఫర్లు ఆఫ్లైన్‌లో చేయాలని డాక్టర్లు కోరారు. టీజీడీఏ



ఆఫీస్ బేరర్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, 2 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్నవారికి కూడా బదిలీల్లో అవకాశం ఇవ్వాలని, జిల్లాల్లోని మెడికల్ కాలేజీల్లో పనిచేస్తున్న వారికి హైదరాబాద్‌లోని కాలేజీల్లోకి వచ్చేందుకు అవకాశం ఇవ్వాలని డాక్టర్లు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం, పారదర్శకంగా ట్రాన్స్‌ఫర్లు చేపడుతామని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో వైద్య విద్యను బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా హాస్పిటళ్లను తీర్చిదిద్దుతున్నామని.. ఇందుకు డాక్టర్ల సంపూర్ణ సహకారం అవసరం అని మంత్రి పేర్కొన్నారు. కాలేజీలు, హాస్పిటళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీవో ప్రకారం ట్రాన్స్‌ఫర్లు ఉంటాయన్నారు. అడ్మినిస్ట్రేషన్, టీచింగ్, క్లినికల్ వర్క్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాల్లోని కాలేజీలు, హాస్పిటళ్లలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్నవారికి బదిలీల్లో అవకాశం కల్పిస్తామన్నారు.

## ఈ నెలాఖరుకు 90శాతం

# ఎస్ఐఆర్ మ్యాపింగ్ పూర్తి చేయాలి

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** ఈనెలాఖరు నాటికి ఎస్ఐఆర్ మ్యాపింగ్ 90శాతం పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లను సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం నుండి తెలంగాణలోని డీఈఓలు, ఈఆర్ఓలతో 'ప్రత్యేక ముమ్మర సవరణ' (ఎస్ఐఆర్)పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మరియు ఈ నెలాఖరుకు 90 శాతం పురోగతిని సాధించాలని కలెక్టర్లు, డీఈఓలను ఆదేశించారు. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) త్వరలో ప్రత్యేక ముమ్మర సవరణను ప్రకటించనుందని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియలో వివిధ నివాస సంఘాలు మరియు గేటెడ్ కమ్యూనిటీలను భాగస్వాములను చేయాలని సీఈఓ కోరారు. ప్రభుత్వ అధికారులందరూ సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి స్వచ్ఛందంగా మ్యాపింగ్ చేసుకోవాలని సూచించారు. ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు, బీఎల్ఓలు గేటెడ్ కమ్యూనిటీలు మరియు మురికివాడలను సందర్శించి, అక్కడి ప్రతినిధుల సహకారంతో మ్యాపింగ్ నిర్వహించాలన్నారు. ఓటర్లకు మ్యాపింగ్ కోసం సహాయం చేయడానికి 'హెల్ప్ డెస్క్'లను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయడానికి స్వయం సహాయక బృందాలు, రేషన్ షాపు డీలర్లు మరియు ఉద్యోగ సంఘాలను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. మరణించిన వారు, వలస వెళ్లిన వారు మరియు శాశ్వతంగా నివాసం మారిన ఓటర్లపై దృష్టి సారించి, నిబంధనల ప్రకారం వారి వివరాలను సరిదిద్దాలని ఆదేశించారు. అలాగే వీవీఐపీ, వీఐపీ ఓటర్ల మ్యాపింగ్‌ను కూడా చేపట్టాలన్నారు. ప్రతి బుధవారం రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించాలని కలెక్టర్లను కోరారు. బీఎల్ఓలు ఎటువంటి సమాచారాన్ని లేదా ఓటిపీలను (ఓటీపీఎస్) అనధికార వ్యక్తులతో పంచుకోవద్దని సిఈఓ హెచ్చరించారు. అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓటర్లను గుర్తించడానికి కేవలం బీఎల్ఏల సహాయం మాత్రమే తీసుకోవాలని చెప్పారు. తప్పుడు మ్యాపింగ్‌లపై దృష్టి సారించి, వాటిని వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. తమ జిల్లాల్లోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఈ ప్రక్రియపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు ముఖ్య ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ, నోడల్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్, సాంకేతిక సిబ్బంది మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ టు ముంబై..

# మెడిసిన్ రవాణాకోసం స్పెషల్ ట్రైన్

**తెలంగాణ బ్యూరో, దీక్షప్రభ:** అత్యాధునిక సేవలను కల్పించడంలో నూతన సాంకేతికతలు, ఆవిష్కరణలతో భారతీయ రైల్వే దూసుకపోతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఫార్మా క్యాపిటల్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ నుంచి ముంబైలోని జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ కు ఔషధాలను సరఫరా చేసేందుకు ఔషధి ఎక్స్‌ప్రెస్' పేరుతో ప్రత్యేక ఫార్మసీ రైలును కేంద్రం ప్రారంభించడం హర్షనీయమన్నారు. మొదటి రెగ్యులర్ 'ఔషధి ఎక్స్‌ప్రెస్' ప్రత్యేక రైలును తెలంగాణకు కేటాయించడం గర్వంగా ఉందన్నారు. సోమవారం ప్రధాని మోడీ, రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ధన్యవాదాలు తెలిపారు. ఈసందర్భంగా పేర్కొంటూ ప్రత్యేక రీఫర్ రైలును ప్రారంభించడం హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు చాలా మేలు జరగడంతో పాటు దేశవ్యాప్తంగా, వివిధ దేశాలకు సరైన సమయంలో ఔషధాలను చేరవేసేందుకు వీలు కలుగుతుంది. హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ, జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా, పటాన్‌చెరులోని ఫార్మా జోన్, ముచ్చర్ల లోని ఫ్యూచర్ సిటీ తదితర ప్రాంతాల్లో ఉత్పత్తయ్యే ఫార్మా ప్రొడక్ట్స్ సరఫరాకు ఈ రైలు చాలా కీలకం కానుంది. ఫ్రీజర్ ఫెసిలిటీ లేకపోతే చాలా వరకు లైఫ్ సేవింగ్ డ్రగ్స్ నాణ్యత తగ్గుతుందని, హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో తయారయ్యే మందులను వాటి నాణ్యత తగ్గకుండా సరఫరా చేయాలనేది మోదీ సర్కారు సంకల్పమన్నారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నడుస్తున్న సనత్ నగర్‌లోని ఇన్ ల్యాండ్ కంటైనర్ డిపో నుండి ఈ ప్రత్యేక రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఔషధ ఎక్స్‌ప్రెస్'గా నామకరణం చేసిన ఈ రెఫ్రిజిరేటర్ రైలు ద్వారా లైఫ్ సేవింగ్ మందులతో పాటు అవసరమైన ఇతర సరుకులను కూడా రవాణా చేయనున్నారు. కంటిన్యూయస్ రిఫ్రిజిరేషన్ ఉండేందుకు డీజిల్ పవర్ ప్యాక్‌లతో కూడిన అధునాతన రీఫర్ కంటైనర్లను వినియోగిస్తున్నారు. ఇది మన కోల్డ్‌చైన్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటుగా మన ఫార్మాసూటికల్స్ సప్లయ్ చైన్ కెపాసిటీని పెంచేందుకు కీలకమైన ముందడుగు కానుంది. ప్రస్తుతానికి వారానికి ఒకసారి నడుస్తున్న ఈ 'ఔషధి ఎక్స్‌ప్రెస్ డిమాండ్, వాణిజ్య వర్గాల అవసరాలకు అనుగుణంగా వారానికి రెండుసార్లు నడిపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇన్నొవేషన్ బేస్డ్ సొల్యూషన్స్ తీసుకురావడంలో మోడీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు కొత్త అవకాశాలకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది.






# క్యాన్సర్‌ను చూసి భయపడొద్దు

- మెరుగైన చికిత్సతో నయం చేయొచ్చు
- నేరుగా ప్రజల వద్దకే వైద్య సేవలు
- ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించి ప్రాణాలు కాపాడుకోవాలి
- బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ కల్పన రఘునాథన్
- బీరంగూడ క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన

**అమీన్‌పూర్,దీక్ష ప్రభ:** ప్రజలు హాస్పిటల్ వరకు రావాల్సిన అవసరం లేకుండా, బాధితుల వద్దకే నేరుగా వెళ్లి అవగాహన కల్పించాలనే సంకల్పంతో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామని బసవతారక క్యాన్సర్ హాస్పిటల్ డైరెక్టర్ కల్పన రఘునాథన్ తెలిపారు. మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా బీరంగూడలోని భ్రమరాంబికా నగర్ కాలనీలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్ విజయవంతమైంది. బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, ఈఎస్ఐ, శ్రీ వేద ఆసుపత్రి సంయుక్త సౌజన్యంతో జరిగిన ఈ శిబిరానికి ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన లభించింది.ఈ సందర్భంగా బసవతారకం హాస్పిటల్ అసోసియేట్ డైరెక్టర్ కల్పన రఘునాథన్ మాట్లాడుతూ..మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, వాతావరణ కాలుష్యం మరియు పారిశ్రామిక ప్రాంతాల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలే క్యాన్సర్ పెరగడానికి ప్రధాన కారణాలన్నారు. కలుషిత ఆహార పదార్థాలు, పని ప్రదేశాల్లోని పరిస్థితులపై తమ సంస్థ నిరంతరం రీసెర్చ్ చేస్తోందని వెల్లడించారు.సీనియర్ ఆంకాలజిస్ట్ డాక్టర్ రవీనా మాట్లాడుతూ..ప్రధానంగా మహిళల్లో వచ్చే క్యాన్సర్ల పట్ల వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. క్యాన్సర్‌ను చూసి భయపడాల్సిన అవసరం లేదు. వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్స ద్వారా పూర్తిగా నయం చేయవచ్చు అని ఆమె సూచించారు. బసవతారక హాస్పిటల్ ప్రత్యేక వాహనం నేరుగా మీ ప్రాంతానికే వస్తుందని, ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. శిబిరంలో మొత్తం 228 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా, వారిలో 100 మంది పురుషులు, 128 మంది మహిళలు ఉన్నారు. ఈ కార్యక్రమాన్ని ఈఎస్ఐ అధికారుల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్మికులు, మహిళలు, సామాన్య ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ శిబిరంలో వందలాది మందికి ప్రాథమిక పరీక్షలు నిర్వహించి,తగు జాగ్రత్తలు సూచించారు.




# బోధనా పద్ధతులపై గీతంలో శిక్షణ

- భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు వృత్తి వికాస కార్యక్రమం
- శిక్షణలో ఐఐటీ, ఐఐఎస్సీ, బార్క్ నిపుణులు

**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని, భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'అధునాతన భావనలు, బోధనా పద్ధతులు, విద్యా సాధనాలు' అనే అంశంపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల రెసిడెన్షియల్ వృత్తి వికాస కార్యక్రమాన్ని (ఆర్పీడీపీ) జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇండియన్ ఫిజిక్స్ అసోసియేట్ (ఐపీఏ) విశాఖ చాప్టర్ సహకారంతో, గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేస్తున్నారు. భావనాత్మక అవగాహనను ప్రయోగాత్మక అభ్యాసం, సమకాలీన బోధనా పద్ధతులతో అనుసంధానించడం ద్వారా పాఠశాల, యూజీ స్థాయిలో భౌతికశాస్త్ర విద్యను బలోపేతం చేయడానికి దీనిని రూపొందించారు. తరగతి గదులలో శాస్త్రీయ జిజ్ఞాస, చురుకైన అభ్యాసం, భావనా స్పష్టత, ప్రత్యక్ష ప్రయోగాలను ప్రోత్సహించే వినూత్న బోధనా పద్ధతుల కోసం పెరుగుతున్న అవసరాన్ని తీర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ప్రముఖ సంస్థల నుంచి విశిష్ట విద్యావేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులను ఒకచోట చేర్చి, ఇందులో పాల్గొనే వారికి భౌతికశాస్త్రంలోని అధునాతన భావనలు, ఆధునిక విద్యా సాధనాలు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రయోగాత్మక పద్ధతులు, అనుకరణలు, ఐసీటీ ఆధారిత బోధన, విద్యార్థి మూల్యాంకన వ్యూహాలపై ఈ కార్యక్రమంలో అవగాహన కల్పిస్తారు. గీతం స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ కు చెందిన అధ్యాపక బృందం బోధనా పద్ధతులు, అభ్యాసన సిద్ధాంతాలపై ప్రత్యేక సెషన్లను కూడా నిర్వహించి, ఈ కార్యక్రమాన్ని లక్ష్యాన్ని మరింత సుసంపన్నం చేయనుంది. ఈ మూడు రోజుల కార్యక్రమంలో విద్యుదయస్కాంత సిద్ధాంతం, ఫోటోనిక్స్, క్వాంటం కంప్యూటింగ్, సూపర్ కండక్టివిటీ, అయస్కాంతత్వం, అణు వికిరణం, ప్రయోగాత్మక ప్రదర్శనలు, స్వయంగా తయారు చేసుకునే భౌతిక శాస్త్ర కిట్లు, తరగతి గది బోధనా పద్ధతులు, అభ్యసన మూల్యాంకన పద్ధతులు వంటి అంశాలు ఉంటాయి. ఈ శిక్షణా కార్యక్రమంలో గీతం సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్. అనంత రామకృష్ణ; విశిష్ట విజిటింగ్ ఆచార్యుడు ప్రొఫెసర్ బి.వి.ఆర్. టాటా; ఐఐటీ మద్రాసు ఆచార్యుడు ప్రొఫెసర్ టి.ఎస్. నటరాజన్; బెంగళూరులోని ఐఐఎస్ సీకి చెందిన ప్రొఫెసర్ విబోర్ సింగ్ వంటి నిపుణులు పాల్గొంటారు. అలాగే గీతం విశిష్ట ఆచార్యుడు ప్రొఫెసర్ జి.రవి కుమార్; బాబా అణు శక్తి సంస్థ పూర్వ శాస్త్రవేత్త ప్రొఫెసర్ జి.ఎ. రామారావు; మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆచార్యులు ప్రొఫెసర్ వనజ, ముంబైలోని టాటా ప్రాథమిక పరిశోధనా సంస్థ, హోమీ భాభా విద్యా సంస్థకు చెందిన ప్రొఫెసర్ దీపాచారి తదితరులు పాల్గొని, సదస్యులకు తగిన మార్గదర్శనం చేయనున్నారు. ఈ కార్యక్రమం పాఠశాల స్థాయి భౌతిక శాస్త్రం, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుల కోసం ఉద్దేశించారు. భౌతికశాస్త్ర విద్యలో ఉత్తమ పద్ధతులు, వినూత్న విధానాలను పంచుకోవడానికి ఒక సహకార వేదికను సృష్టించడం దీని లక్ష్యం. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ జి.సాయిప్రీతి, డాక్టర్ టి.విశ్వం సమన్వయం చేస్తున్నారు. ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, ఇతరత్రా వివరాల కోసం కార్యక్రమ సమన్వయకర్తలు షామాబీ (77802 74121) లేదా గోపీకృష్ణ (87120 18815) లను సంప్రదించవచ్చు.

# ఆత్మ రక్షణకు కరాటే దోహదం

- ప్రతి ఒక్కరు స్వీయ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి
- క్రీడల పట్ల ఆసక్తి కలిగిన ఎమ్మెల్యే దొరకడం అదృష్టం
- సినీ నటుడు సుమన్
- పటాన్ చెరులో అట్టహాసంగా ముగిసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక 10వ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలు
- విజేతలకు సినీ నటుడు సుమన్ తో కలిసి బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** ప్రస్తుత సమాజంలో స్వీయ రక్షణ కోసం విద్యార్థినిలు, మహిళలు తప్పకుండా కరాటే నేర్చుకోవాలని, దీని ద్వారా మానసిక ప్రశాంతత శారీరక ధారుఢ్యత లభిస్తుందని సినీ నటుడు సుమన్ అన్నారు. పటాన్ చెరు డివిజన్ పరిధిలోని భారతరత్న పీవీ నరసింహారావు ఆడిటోరియంలో ఎమ్మెల్యే జీఎంఆర్ సౌజన్యంతో లక్కీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక పదవ జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హీరో సుమన్ మాట్లాడుతూ..క్రీడల పట్ల ఆసక్తి కలిగి నిరంతరం క్రీడల అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి దొరకడం పటాన్ చెరు నియోజకవర్గం ప్రజల అదృష్టమని అన్నారు. గత పది సంవత్సరాలుగా జాతీయస్థాయి కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు సహకారం అందించడం పట్ల అభినందనలు తెలిపారు. తాను విద్యార్థి దశ నుండి మార్షల్ ఆర్ట్స్ ని నేర్చుకోవడం ప్రారంభించామని, 50 సంవత్సరాలు గడిచిన ఇంకా ఆసక్తి తగ్గలేదని తెలిపారు. చదువుతోపాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ..నియోజకవర్గంలో క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా ఏడాది పొడవునా వివిధ అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడలకు పటాన్చెరు కేంద్రంగా నిలవడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెంకట్ రెడ్డి,వెంకటేష్,షకీల్, రామ్మోహన్,వినోద్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.





# విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



**నర్సింహులపేట,దీక్ష ప్రభ:** విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని బక్క తండా గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బక్క తండాకు చెందిన గుగులోతు శ్రీను ఎద్దు సోమవారం గ్రామ సమీపంలోని మేత మేయడానికి వెళ్లింది.ఈ క్రమంలో 11 కెవి విద్యుత్ ట్రాన్స్ఫారం వద్ద అక్కడ కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఎద్దుకు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రైతు శ్రీను సంఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించాడు. చనిపోయిన ఎద్దు విలువ సుమారు 90 వేలు ఉంటుందని తమకు తగిన నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వం తనను ఆర్థికంగా ఆదుకోవాలని శ్రీను కోరాడు. ఈ మేరకు పశుసంవర్ధక శాఖ,విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

# రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ అభివృద్ధి

- ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం
- ఒకే రోజు రూ.19 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ప్రజాఅవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన
- పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి




**పటాన్ చెరు,దీక్ష ప్రభ:** రాజకీయాలకు అతీతంగా బొల్లారం డివిజన్ ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా తీర్చిదిద్దుతున్నామని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం బొల్లారం డివిజన్ పరిధిలోని బాలాజీ నగర్, బీసీ కాలనీ, బీరప్ప బస్తి, గాంధీ నగర్, ఐడిఏ కాలనీ, కె.బి.ఆర్ కాలనీ, లక్ష్మీ నగర్, శ్రీ రామ్ నగర్, వైఎస్ఆర్ కాలనీలలో 19 కోట్ల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, యూజీడి నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న బొల్లారం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతున్నామని తెలిపారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న తాగునీటి సమస్యను సైతం పరిష్కరించడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులకు రూపకల్పన చేయబోతున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, మాజీ జడ్పిటిసి బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, చంద్రారెడ్డి,సీఐ రవీందర్ రెడ్డి, ఈఈ సురేష్, డిఈ వెంకటరమణ, మాజీ ప్రజా ప్రతినిధులు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



Printed,Published,Edited, & owned by **Rathod Vinod Kumar** Published from **SNEHITHA PUBLICATIONS** Falcon Printing press, # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code :502220, Printed At Falcon Printing Press # 1-2-201,Shop No.2,Khan Street Zaheerabad Town,Sangareddy District,Telangana State pin code: 502220, Editor: **Rathod Vinod Kumar**. RNI NO. TELTEL/2023/87655,Cell : 9550021491,7893532721, Gmail: deekshaprabhatelugudaily@gmail.com